కాలుష్యానికి దూరంగా వుండాలని పల్లెసీమకొస్తే అతనికెదురైన అనుభవం?

## భమిడిపాటి అనంతశర్మ కథ

# కాలుష్యం

బస్సు రావులపాలెం దాటింది. అమలాపురం వైపు వెళ్తోంది.

రోడ్డుకి ఎడంపక్క కాలవ. కుడిపక్క కొబ్బరితోటలు.

ఎండ పల్చబడింది. నీడలు ఎదుగుతున్నాయి. ఆ నీరెండలో కొబ్బరి చెట్ల తలల నీడలు కాలవ ప్రవాహం మీద పడుతున్నాయి. నీడలేని చోట్ల నీరెండలో నీళ్ళు మిలమిల మెరుస్తున్నాయి. పట్నాల నుంచి పల్లె పట్టులకి దిగుమతి అవుతున్న ఇమిటేషన్ నాగరికతలా, ముచ్చి బంగారంలాగుంది ఆ మెరుపు.

కొబ్బరి చెట్ల నీడలు పడిన చోట్ల కాలవలో కొట్టుకొస్తున్న చెత్త చెదారం తెట్లు కట్టి నీళ్ళ మీద తేలి స్పష్టంగా కనిపిస్తోంది. నాగరికత తళుకు బెళుకులు సరసనే పేరుకుపోతున్న కాలుష్యం లాగుందా తెట్టు.

బస్సు జోరుగా పోతోంది. ప్రేమ సన్నివేశాలని చదివెయ్యాలనే ఆతృతలో వర్ణనలు రాసిన పేజీలని చదవకుండానే తిప్పేసే నవలా పాఠకురాలిలా, చిన్నచిన్న స్టేజిలలో మనుషులు ఒకరు, ఒకటిన్నర వున్నా ఆగకుండా ముందుకు దూకేస్తోంది. బస్సు ముక్కామలలో ఆగింది దిగవలసిన పాసింజర్ల కోసం.

చేతిలో సూట్‌కేసు, భుజాన బేగ్‌తో బస్సు దిగేడు శివశంకరం. అక్కణ్నుంచి అతను వేదునూరు వెళ్ళాలి. మూడు కిలోమీటర్లుంటుంది. జట్కా కట్టించుకున్నాడు

“తవరు... చంటబ్బాయిగారి తాలూకే గదండీ!” దారిలో అడిగేడు జట్కా-



మనిషి.

అవునన్నాడు శంకరం.

''ఆరు తవరికేమౌతారండీ''

''మా పెదనాన్నగారబ్బాయి''

''అయితే... తమరు కిట్టంబాబుగార బ్బాయి గోరేంటండి!''

అవునన్నాడు శంకరం.

''నాన్నగారి ఉజ్జోగం ఎక్కడండీ?''

''బొంబాయిలో''

''మరి... తమరెక్కడ జేత్తన్నారండీ?''

''భోపాల్‌లో''

''తవరీ సైదు కెప్పుడూ ఒచ్చినట్టు లేదు కదండీ''

లేదన్నాడు శంకరం.

''అదేలెండి. మీ నాన్నగారు మొన్నమొన్నటి దాకా పండగలకొత్తానే వుండేవోళ్లు కదా! మీ తాతగారు పోయాక... అంతా పోగేసి పదేల్లయిందేమో... రాడం మానేసేరు. తవర్ని సిన్నప్పుడు సూసె వుంటాన్లెండి. గాపకం లేదు. ఆ మొగాన్నిబట్టి పోల్సుకున్నాను...''

రోడ్డంతా గతుకులు. బండి కుదుపుకి చక్రాలు విరిగిపోతాయేమో అన్నంత భయం వేసింది శంకరానికి.

''ఒత్తా ఒత్తా తవరొక్కరే ఒత్తన్నారేటండీ... అమ్మాయిగోర్ని, పిల్లల్ని తీసుకురాకపోయారా! ఓపాలి మీ వూరు, మీ ఇల్లు, సుట్టాలు అందర్నీ సూసినట్టుండును!'' అని, ''ఓసారి ఒత్తూ పోతూ వుంటేనే గదండీ సుట్టరికాలు, అబిమానాలూను!'' అన్నాడు.

ప్రశాంతమైన సరస్సులో ఏనుగు దిగి కలచివేసినట్లు, జట్కావాడి కలుపుగోలు మాటలు శివశంకరం మనస్సుని కెలికివేసేయి. సంవత్సరకాలంలో మనసు కింది పొరల్లోకి సర్దుకుంటున్న బాధ, దిగులు మళ్ళీ పైకి పెల్లుబికి వచ్చి అతనిలో సంక్షోభాన్ని రేపేయి.

* * *

శివశంకరం నలభైఏళ్ళవాడు. భోపాల్‌లో ఓ పెద్ద ఫ్యాక్టరీలో ఇంజనీరు. అతనికిద్దరు పిల్లలు. భార్య బంగారు బొమ్మ. పిల్లలు మంచి ముత్యాలు.

మంచి ఉద్యోగం! పెద్ద జీతం! గొప్ప హోదా!

అపురూపమైన భార్య. కళ్ళు కుట్టే సంసారం.

ఓ రోజు శివశంకరం ఆఫీసు పనిమీద ఢిల్లీ వెళ్ళేడు. అక్కడ నాలుగురోజులుండాల్సిన పని. కాని, మూడోరోజు ఉదయమే రేడియోలో వార్త — భోపాల్‌లో ఒక ప్రాంతంలో ప్రజలు తాగే నీరు విషపూరితమైందట. ఆ నీరు తాగి కొంతమంది మరణించారుట. చాలామంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారుట.

వార్త వింటూనే శివశంకరం నరాలు చచ్చుపడిపోయాయి.

అంతలోనే ధైర్యం తెచ్చుకున్నాడు. ఆశగా, ఆతృతగా బయల్దేరేడు. భోపాల్‌లో దిగాడు. గబగబ ఇంటికెళ్ళాడు. ఇంటికి తాళం పెట్టి వుంది. ఆసుపత్రికి వెళ్ళాడు. ధైర్యం జారిపోతోందతనికి.

ఆసుపత్రి అంతా పరుగుపరుగున తిరిగేడు. గదులన్నీ వెదికేడు. బెడ్సమీద వున్న వాళ్ళని పరికించి చూసేడు. అతని భార్య, పిల్లలు కనబడలేదు. ఇంక కూలబడిపోయాడు.

ఆసుపత్రి ఉద్యోగి ఒకరు శంకరాన్ని ఓ అధికారి దగ్గరకి తీసికెళ్లాడు. అతను కొన్ని ఫోటోలు చూపించాడు శంకరానికి. అవి చచ్చిపోయిన వాళ్ళ ఫోటోలు. ఆ ఫోటోల్లో

వున్నారు శంకరం భార్య, పిల్లలిద్దరు.

కళ్ళు చెదిరే కాపురం కనుమరుగైపోయింది. ఆ ఆనందం, ఆ మధుర దాంపత్యానుభూతి శుక్లపక్ష పాడ్యమినాటి చంద్రరేఖలా అలా కనిపించినట్లే కనిపించి అంతలోనే అంతర్ధానమైపోయింది.

మర్నాటికి బొంబాయి నుంచి అతని తండ్రి వచ్చాడు. కొడుకుని ఓదార్చి తనతో బొంబాయి తీసికెళ్ళాడు.

బొంబాయి చేరిన కొద్దిరోజులకే — మళ్ళా పెళ్ళి చేసుకోమంటూ తల్లి పోరు మొదలయింది. మళ్ళీ పెళ్ళి ఆలోచన తట్టుకోలేక, తల్లి పోరు భరించలేక ఇంట్లోంచి బయటకొస్తే ఆ నగరమే ఓ పెద్ద కార్ఖానా!


ఎడాపెడా ఎత్తయిన కట్టడాలతో బలిసిపోయిన ఆ మహానగరంలో — ఎక్కడ ఏ వేళ చూసినా వాహనాలు, వేగం, రద్దీ, రొద, ధూళి, పొగ! వాతావరణ కాలుష్యం. యాంత్రిక జీవితం మనుషులకంటె యంత్రాలకే గౌరవం!

అక్కడ గాలి కృత్రిమం. వెలుతురు కృత్రిమం. చల్లదనం, వెచ్చదనం అంతా కృత్రిమం. నిలబడే తీరికలేదు. నిదానించి చూసే ప్రకృతి లేదు.

వద్దు! ఈ నాగరికత వద్దు. ఈ వాతావరణ కాలుష్యానికి దూరంగా పోవాలి — అనుకుంటూండగా — అదిగో — అప్పుడు గుర్తుకొచ్చింది శివశంకరానికి — పొంతూరు, పల్లెటూరు, వేదునూరు. ఆ పల్లెలో వాళ్ళకొక ఇల్లుంది. ఆరెకరాల పొలం వుంది. అక్కడికెళ్ళి, ఆ పొలం చూసుకుంటూ, ఆ ఇంట్లో ప్రశాంతంగా జీవించాలి అనుకున్నాడు. తక్షణం బయల్దేరేడు. ఆ యాంత్రిక, నాగరికతా, వాతావరణ కాలుష్యం శివశంకరాన్ని పల్లెసీమకు తరిమింది.

* * *

ప్రశాంత జీవితం కోసం ఆ పల్లెటూరికొచ్చాడు శంకరం. ఎక్కువగా ఏకాంతంగా



ఏదో ఆధ్యాత్మిక గ్రంథం చదువుకుంటూ గడపడమే అతనికిష్టం.

కాని అతనికే మాత్రం ఆసక్తి లేకపోయినా, చెరువుకి స్నానానికి వెళ్లేటప్పుడో, సాయంత్రం దేవాలయానికి వెళ్ళేటప్పుడో, సరుకులు కొనుక్కోడానికి దుకాణానికెళ్ళినప్పుడో ఎవరో ఒకరు కనబడడం, అతన్ని నిలబెట్టి, స్థానిక రాజకీయాలో, వాళ్ళ సొంత గొడవలో, వాళ్ళ మీద వీళ్ళ మీద విమర్శలో రొద పెడుతూండడం — ఇవి తప్పడంలేదు

ఓ రోజు సాయంత్రం దేవాలయానికి వెళ్ళి వస్తుంటే పలకరించాడు భానుమూర్తి. వాళ్ళింటికోసారి రమ్మని బలవంతపెట్టి తీసికెళ్ళాడు.

మధ్యతరగతి స్థాయి నుంచి పేదరికానికి దిగజారుతున్నట్లున్నాయి ఆ ఇంటి పరిస్థితులు. ఇల్లు పెద్దదే. వెలిసిపోయింది. ఇంట్లో సామాన్లు వెనకటి కాలానివి. తలుపులూడిపోయిన బీరువా, చేతులు విరిగిన కుర్చీ... ఇలా వున్నాయి. పెరడు తైలసంస్కారం లేక జడలు కట్టిన జుట్టులా, వ్యాకరణం లేని భాషలా, అడవిలా అధ్వాన్నంగా వుంది.

దరిద్రం వెనక బద్ధకం వస్తుందో, బద్ధకం వెనక దరిద్రం వస్తుందోకాని, ప్రస్తుతం ఆ ఇంట్లో రెండూ సఖ్యంగా వున్నాయి.

ఆ ఇంట్లో మనుషులు ఆ ఇంటికి ప్రతిబింబాల్లాగున్నారు.

భానుమూర్తి భార్య... తల ఒకవైపుకి ఒరగబెట్టి కళ్ళు చికిలించి చూస్తుంది. అతి దగ్గరగావున్న మనిషితోకూడా ఓ వెయ్యిమంది సభలో మైకు లేకుండా మాట్లాడే స్థాయిలోనే మాట్లాడుతుంది. చెవుడు లేదా మెకు.

భానుమూర్తి పెద్ద కూతురు కల్యాణి. ముఖాన బొట్టులేదు. మెడలో తాడులేదు చేతులకి గాజుల్లేవు. ముఖాన చిరునవ్వు లేదు. వయస్సు పాతికలోపే అంటే నమ్మడం కష్టం. రెండేళ్ళయింది ఆమెకాస్థితిపట్టి.

రెండో కూతురు దుర్గ. కనకదుర్గ. వయస్సు ఇరవై దాటలేదు. పెళ్లయింది. ఆవూరి సంబంధమే, కనకయ్య కొడుకు రామానికిచ్చి చేసేరు. శివశంకరం ఇంటికి ఎదురుగానే కనకయ్య ఇల్లు. నిండా ఏడాది కాపురం చెయ్యలేదు. అమ్మాయిని పుట్టింటికి పంపేసేరు. పంపేసి ఏడాది దాటిపోయింది. మళ్ళీ కాపురానికి తీసికెళ్ళరు.

ఆ గాథ వివరంగా తెలుసుకోవాలనే ఆతృతని నిగ్రహించుకోలేకపోయాడు శివశంకరం. భానుమూర్తి ఉక్రోషాన్నీ ఆపుకోలేకపోయాడు.

"మేం కట్నం ఏమీ ఇవ్వలేదు. నిజమే. అసలీ సంబంధం నాకిష్టంలేదు. నా స్థితిగతులు నాకు తెలీవూ? కాని వాడొచ్చి రోజూ ఇక్కడే దేకేవాడు. ఒద్దు నాయనా అని చెప్పేం. విన్నాడు కాదు. పెళ్ళిదాకా వచ్చింది. ఉపవాసాలు చేసి ఛస్తాను అని కొడుకు బెదిరిస్తే తల్లి, తండ్రి ఒప్పుకున్నారు పెళ్ళికి. పెళ్ళయింది.

వాళ్ళని కప్పెట్టేనంత ఆస్తి వుందండీ. ఒక్కడే కొడుకు. అయితే మాత్రం — వెధవ లేకి బుద్ధి! అందరి కంట ఆఖర్న

అన్నంతినేది కోడలే కదండీ — ఏనాడూ దానికి అన్నంలోకి కూర మిగలదు. కోడలు కోసం అవి అడుగు అన్నం మాడ్చేసేది. ఏ రోజయినా కోడలు తినేది మాడుఅట్టులు కట్టిన అన్నమే. పులుసు, చారు వుంటే. వాళ్ళంతా తినేసేక, కోడలు తినడానికి ముందు దాంట్లో ఓ గ్లాసుడు నీళ్ళు పోసెయ్యడం! పాపం పుట్టింటికొస్తే తిండికి మొహం వాచినట్లు అన్నం తినేదండి నా కూతురు''

భానుమూర్తి ఆగేడు. పొంగే దుఃఖాన్ని దిగమింగుకొన్నాడు.

''అయ్యో... అయ్యో... ఎవరితోనైనా అంటే ఇంట్లో గుట్టు వీధిలో పెట్టేనంటారు. శంకరంగారు... లోకంలో ఎక్కడైనా వుందాండీ! సాయంత్రం ఆ అత్తగారు పెరట్లో తులసి కోట దగ్గర కూర్చుని, దువ్వెన్న, కొబ్బరినూని సీసా గదిలో వున్నాయి తెమ్మని కోడల్ని పురమాయించిందిట. మా అమ్మాయి సరే అని గదిలోకి వెళ్ళింది. అక్కడ గదిలొ పందిరిమంచం మీద ఆ పెద్ద వెధవ కనకయ్య పడుక్కొని వున్నాడు. మా పిల్ల — పాపం చూసుకోలేదు, దువ్వెన్న కోసం వెదుకుతుంటే ఆ దున్నపోతు లమ్డికొడుకు చటుక్కున లేచి దీని చెయ్యి పట్టుకొని లాగాట్ట. పాపం — ఇదేం చేస్తుంది? భయపడిపోయి ఒక్క కేకవేసి గదిలోంచి బయటికి పరుగెత్తుకొచ్చేసింది. దాన్ని అంటించెయ్య... ఆ అత్తగారి కెన్నేళ్ళొచ్చేయండీ! అసలు... కోడలు కాపురానికొచ్చాక, ఆ గాడిద కొడుకు గదిలోకి వెళ్ళి పందిరి మంచం మీద పడుక్కోడం ఏమిటి చెప్పండి! ఆ మొగుడు వెధవ గదిలో పడుక్కున్నాడని తెలిసి కూడా అత్తగారు కోడల్ని దువ్వెన్న కోసం ఆ గదిలోకి పంపడం ఏమిటండీ! దాని కాళ్ళు పడిపోయాయా? అది వెళ్ళి తెచ్చుకోలేదూ? ఇది కాపురాని కెళ్ళిందగ్గర్నుంచీ ఇదే వరస! ఆ పెద్దపీనుక్కి కాఫీ ఇమ్మనో, కాళ్ళు కడుక్కొందుకు నీళ్ళిమ్మనో స్నానానికి నీళ్ళు పెట్టమ



## రంగులు

ఉషని అడిగాడు ఉమాకాంత్ —

''ఈ ఆకుపచ్చని పొలాలు, ఈ నీలి ఆకాశం చూస్తుంటే నీకేమనిపిస్తోంది డియర్?''

''నీచేత ఆకుపచ్చ రంగులో ఒకటి, నీలిరంగులో ఒకటి — వెరసి రెండు పట్టుచీరెలు కొనిపించాలని అనిపిస్తోంది...'' ఠక్కున చెప్పింది.

—పైడిమర్రి ఆంజనేయులు (కడప)

నో, సబ్బు, తువ్వాలు అందివ్వమనో పుర మాయించడం. ఆ వెధవ ఇది కనబడిందగ్గ ర్నుంచీ వెకిలి వెధవ వేషాలెయ్యడం! పాపం చిన్నతనం... మా పిల్లకేం తెలుస్తాయి చెప్పండి! ఆ పళంగా, వాడు దీని చెయ్యి పట్టుకున్నాడా — ఇది ఒక్క కేకపెట్టి గదిలోంచి బయటకొచ్చి పడిందా... అంతే! దాని కళ్ళు కాలిపోను... ఆ చుప్పనాతి ముండ... ఎంత బరితెగించి పోయిందో చూడండి... మామగారు పందిరి మంచం మీద పడుక్కుంటే ఆ గదిలో నీకు పనేమిటి? అంటూ

రక్కేసి, తెయ్యమని ఒకటే ఎగిరిపోయిందం డోయ్!''

గుక్క తిప్పుకుందుకు ఒక్కసారి ఆగేడు భానుమూర్తి.

''మరి అల్లుడేమంటాడు?'' అనడిగేడు శివశంకరం సాలోచనగా.

''ఏడిసేడు అప్రయోజక వెధవ! ఈ కథ జరుగుతున్నంతసేపూ వాడు వీధి అరుగు మీదే తచ్చాడుతున్నాట్ట! కాస్సేపుం డి దీన్ని పట్టుకుని బాదాట్ట! తల్లీతండ్రీ మాట పట్టుకొని పెళ్ళాన్ని కొట్టే వెర్రి వెధవండీ వాడు! ఆ రాక్షసిముండ తన పెళ్ళానికి, తండ్రికి రంకు కడితే నోరు మూసుకొని పడుంటాడా కొజ్జా వెధవ కాకపోతేను. ప్రేమించేను, పెళ్ళి చెయ్యకపో తే ఛస్తాను అన్న గాడిద, ఆ తల్లి వెధవ పెళ్ళాన్ని పుట్టింటికి పంపేస్తే నోరు మెదప దేం?'' సూటిగా ప్రశ్నించాడు భానుమూర్తి

శివశంకరానికి ఏం మాట్లాడాలో తెలియ లేదు. అతని హృదయం బరువెక్కిపోయింది భానుమూర్తి మనసు కొంచెం తేలికపడింది

* * *

శివశంకరం ఆ ఇంట్లో దిగిందగ్గర్నుంచీ అతనితో కనకయ్య చనువుగా మాట కలుపు తూనే వున్నాడు. ఒకటి రెండుసార్లు వాళ్ళిం టికి భోజనానికి రమ్మన్నాడు కూడా. కాని శంకరం మృదువుగా తిరస్కరించేడు. ఎవరి తోను, స్నేహాన్ని, చనువుని పెంచుకోడం అతని కిష్టంలేదు. కాని భానుమూర్తి చెప్పిన దుర్గ కథ విన్నాక అతను కూడా కనకయ్యతో కలివిడిగా మాట్లాడ్డం మొదలెట్టేడు. అప్పు డప్పుడు వాళ్ళింటికి వెళ్తున్నాడు. కనకయ్య భార్య వర్ధనమ్మకి కూడా శంకరం దగ్గర కొత్తపోయింది. చనువుగా కాకపోయినా చొర వగా మాట్లాడగలుగుతోంది. ఈ మాత్రం సాన్నిహిత్యం పెరిగాక ఓ సాయంత్రం వేళ శంకరం కనకయ్య ఇంటికెళ్ళాడు. శంకరాని కి, తన భర్తకి టీ ఇచ్చింది వర్ధనమ్మ.

శంకరం, కనకయ్య టీ తాగుతూండగా. .. వర్ధనమ్మ ఏదో తల్చుకుంటూ కళ్ళు తుడుచుకుంది. అప్పుడే రామం బయటనుం చి వచ్చి గదిలోకెళ్ళాడు.

''ఒక్కగానొక్క కొడుకు... వాడి మొ హాన సుఖం రాసిపెట్టి వుందోలేదో...''

అనుకుంటున్నట్లుగా అంది వర్ధనమ్మ.

శివశంకరం టీ తాగడం ఆపి సానుభూ తిగా, ఆసక్తితో ఆమెకేసి చూసేడు.

''అసలు ఊళ్ళో సంబంధం చేసుకోడం బుద్ధి తక్కువతనం కదండీ అన్నయ్యగారూ — పాతికవేలిస్తాం, ముప్పైవేలిస్తాం అంటూ వచ్చిన విక్షేపంలాంటి సంబంధాలని ఒద్దని

తోసిపారేసేడు మా వాడు. వాడికి అది ఏం పెట్టిందో, ఉత్త వె్రరివెధవని చేసేసింది. దాని పిచ్చిలోపడిపోయాడు. దాన్నే కాని పెళ్ళాడను అని కూర్చున్నాడు. ఇంకేం వుందీ? వాళ్ళకి కూడా లోకువైపోయిందీ? దాంతో పెళ్ళి చెయ్యకపోతే చచ్చిపోతానని అన్నం తినడం కూడా మానేసేడు. పోనీలే..

ఒక్కగానొక్క కొడుకు, కట్నాలు, లాంఛనాలుఃశాశ్వతమా? జాగ్రత్తగా చూసుకుంటే వాడికున్నది చాలదా? ముచ్చటపడుతున్నాడు కదాని కట్నం రూపాయి కూడా ఇవ్వకపోయినా పెళ్ళి చేసేం''

ఇక్కడ వర్ధనమ్మ గొంతులో వడి మారింది.

''ఇంట్లో అడుగెడుతూనే మొగుడ్ని తల్లితో మాట్లాడకుండా చేసెయ్యాలా? ఏం... నేను కనలేదా? నేను కని ఇరవైయేళ్ళు పెంచి పెద్దాడ్ని చేస్తే కద ఈ వేళ అది కులకడానికొచ్చింది? అహ్హా... ఇంటికి వచ్చే వాళ్ళుంటారు. పోయేవాళ్ళుంటారు. పట్టపగలే నట్టింట్లో మొగుడుతో ఇకఇకలూ పకపకలూనూ! కొత్తకోడలివి కదమ్మా, కొంచెం చాటు, మాటు వుండాలి. అయినా ఎదురుకుండా పెద్దాయన, మామగారు వున్నారనయినా చూసుకోకపోతే ఎలాగ? మొగాడికేం సిగ్గు? మొగుడ్ని చీటికీ మాటికీ పిలుస్తూండడం, వేళాకోళాలు, వెక్కిరింతలు — ఇదేం బాగుండదు!

ఇంతేనండి అన్నయ్యగారు! ఏ ఒట్టు పెడితే ఆ ఒట్టు! ఇంతకంటె నేనావిడగారిని ఏం ఆంక్షలు పెట్టేను? అంతే... నేనావిడకి విషం అయిపోయాను. ఊళ్ళోనే కదండీ పుట్టిల్లు... ఏ రోజు కబురు ఆ రోజు టపా మోసుకెళ్ళిపోడం! చెరువు రేవులో ఈ కబుర్లన్నీ నలుగురూ వినేలా తల్లితో చెప్తూండడం! ఇంకా చిత్రం... ఇది విన్నారూ... తన పుట్టింటికి మొగుడు చేత కబుర్లు పంపడం... ఈ వె్రరిమాలోకం వెళ్ళి చెప్తూండడం.

ఆఖరుకి నేను కూడా వాడికి దుర్మార్గు




## పాపం వెస్టన్!

ఎలు రిచర్డ్ వెస్టన్! లండన్‌కు చెందిన ఇరవైమూడు సంవత్సరాల ఈ యువకుడి కారు ఎవరో దొంగిలించారు. పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి రోడ్డుమీదకు రాగానే ఎదురుగావున్న సిగ్నల్స్‌వద్ద తన కారు కన్పించింది వెస్టన్‌కు!! వెంటనే పరుగు పరుగున ఆ కారుకు అడ్డంనిల్చాడు. అతడ్ని కేర్ చేయకుండా ఆ దొంగలు స్పీడ్ పెంచారు. పాపం... వెస్టన్‌మీద నుంచి అతడి కారు ముందుకు దూసుకుపోయింది! అంతేం కారే కాదు! అతడి ప్రాణం కూడా దొంగిలించేశారన్న మాట ఆ దొంగలు! పాపం వెస్టన్!

—జూపిటర్

రాలినైపోయాను! అది కాపరానికొచ్చాక నా లుగే నాలుగు రోజులు... అంతే. మరి వాడికి ఏం నూరిపోసిందో, ఏం మంత్రం వేసిందో తెలీదు, తరవాత నుంచి నాతో మాట్లాడితే ఒట్టు. అమ్మా, అమ్మా అంటూ కూడా, కూడా వుండేవాడు. నాతో మాట్లాడ్డు, నాకేసి చూడడు!

వర్ధనమ్మ కళ్ళు చెమ్మగిలాయి. కంఠం బొంగురుపోయింది. ఒక్కక్షణం ఆగి, దుఃఖాన్ని దిగమింగుకొని,

"ఆ కోడలు కేదయినా చెప్పాలన్నా భయమే. ఇదిగో... ఈయన కూడా నన్నే అనడం 'ఇంకా చిన్నతనం, కొత్త కాపురం అలాగే వుంటుంది, కొన్నాళ్ళయేసరికి వాళ్ళకే తెలుస్తుందిలే' అంటూ నా నోరు నొక్కేసేవారు. ఈయనగారి అలుసు చూసుకొని అది మరీ పేట్రేగిపోయింది. అయినా, ఈయనగారికి ఎన్నేళ్ళొచ్చాయి? దానెదురుగానే నన్ను కేకలెయ్యడం, గదమాయించడం! చూసారా? కొడుకు మాట్లాడక పోవడం, మొగుడు తిట్టడం! దానికి బాగా లోకువైపోయిందీ. అమ్మో అమ్మో... అది పెద్ద జాణ కదండీ! ఆ మొగాళ్ళిద్దర్నీ మంచి చేసుకొని, నన్నొక్కర్తినీ వేరుచేసి నా మీద పెత్తనం చేద్దామని చూసిందండీ! అదెంత? దాని వయసెంత?"

"పర్లే... ఇంక వూరుకో! పాపం శంకరంగారికేం తెలుస్తాయి ఇవన్నీ? ఆయనకీ వూరు, ఈ మనుషులు కొత్త. ఆయనతో చెప్తే ఆయనేం చేస్తారు?" అన్నాడు కనకయ్య.

"ఆయనేదో చేసేస్తారని కాదండీ! నా కడుపులో బాధ మీకేం తెలుస్తుందీ? చూసేరా అన్నయ్యగారూ... ఈయన మెత్తదనం అదీ కనిపెట్టేసిందీ. ఈయనగారు పొద్దున్నే నిద్రలేచి పళ్ళు తోంకోడానికి నీళ్ళు పట్రమ్మని కేకేస్తే, నేను ఆ మాట విని, చేతిలో పని అక్కడ వదిలేసి వచ్చేటప్పటికి అప్పుడే అది నీళ్ళు ఆయన చేతికందించి వచ్చేస్తుంది. స్నానానికి చెరువు కెళ్తున్నాననడం చాలు... తువ్వాలు, సబ్బు పట్టుకెళ్ళి అందివ్వడం! ఈయనగారు చెరువుకి సబ్బు ఎప్పుడైనా పట్టుకెళ్ళారా? నాకు సబ్బెందుకు — ఇంట్లో పెట్టెయ్ అని ఈయన అంటే 'తీసికెళ్ళండి మామయ్యా... సబ్బు రుద్దుకొని స్నానంచేస్తే ఒళ్ళు తేలిగ్గా, హాయిగా వుంటుంది!' అంటూ పకపక నవ్వడం"

నాలుగుసార్లు బుగ్గలు నొక్కుకుంది వర్ధనమ్మ.

"అయ్యో... అయ్యో... మావగారితో పరాచికాలా? ఈలోగానే నక్కడికి రాడం చూసి నవ్వుతున్నదల్లా చటుక్కున మూతి ముడిచేసుకోడం! ఇదంతా ఏదో చిన్నతనంలే ! తెలీదు, తండ్రిలాంటివారే కద మావగారు అనుకున్నాను వెర్రిబాగులదాన్ని! కాని వెధవ బుద్ధి ఎన్నాళ్ళు దాగుతుందండీ!

ఆ వేళ... నేను నీళ్ళు తేడానికి చెరువుకెళ్ళాను. ముందు చూసుకోలేదు, నేను పట్టుకెళ్ళిన బిందె చిల్లుది. సగం దూరం వెళ్ళాక చూసుకున్నాను. మళ్ళీ వెనక్కి వచ్చాను, ఇంకో బిందె పట్టుకెళ్దామని! ఇంట్లోకొచ్చి చూస్తే...

అన్నయ్యగారూ... నమ్మితే నమ్మండి, లేకపోతే లేదు. అదిగో, ఆ గదిలో ఈయన

గారు నిద్దరోతున్నారు. అప్పుడు ఆ గదిలో దానికి పనేమిటో చెప్పండి. ఇంక ఇంట్లో ఎవరూ లేరు కదా అనుకొంది. మావయ్యా.. .. మావయ్యా... అంటూ వీపు తట్టి లేపుతోందండీ! నన్ను చూసింది — నాలు క్కరుచుకుని గదిలోంచి ఇవతలకొచ్చేసింది ఏమీ ఎరగనిదానిలా.


ఆ గదిలో కెందుకెళ్ళేవే అంటే దువ్వెన్న కోసం అంది. ఇంక నేనూరుకోలేదు సుమాండీ! దువ్వెన్న కావలసిన దానివి ఆయన్నెందుకే లేపుతున్నావు అని రంయ్‌మ న్నాను. ఈ చేష్టలు ఎవరితో చెప్పుకుంటాం చెప్పండి? ఆ మొగుడు ఇంటికొచ్చేటప్పటికి కల్లబొల్లి రాగాలెదుతూ కూర్చుంది.

ఇంతా అయిందా అన్నయ్యగారు! అక్కడికీ నేను జరిగిందేదో జరిగింది. ఇప్పుడు కేకలేసేను కదా, ఇకపైన తెలుసుకుంటుంది అనుకున్నాను సుమండీ.

ఆ సాయంత్రం మరి ఎప్పుడు వెళ్ళిందో తెలీదు. నాతో చెప్పలేదదు. ఆ మొగుడితో చెప్పిందో లేదో నాకు తెలీదు. పుట్టింటికెళ్ళి పోయింది. అక్కడ ఏం చెప్పిందో, ఇంక చూడండి... ఆ వీధిలో కేకలు ఇక్కడికి వినబడ్డాయి. ఇంక వీళ్ళ రేవులో ఆవిడ తిట్లు, శాపనార్థాలు చెరువులో ఆగ, మగ చెవులు మూసుకున్నారు వినలేక! ఊరంతా నన్ను అడుగుతూండడం! నేను సిగ్గుతో చచ్చిపోయాననుకోండి! తలుపులు తీసి వీధి మొహం చూడాలంటేనే భయం వేసిపోయింది.

అప్పుడు వెళ్ళిన పిల్ల మళ్ళీ ఇక్కడికి రాలేదు. చెప్పద్దూ... పిల్లని పంపించమని ఇంక మేమూ అడగలేదు. ఆడపిల్లని కన్నవాళ్ళకే అంత పొగరైతే మాకేం పట్టింది. వాళ్ళ కాళ్ళు కడుపులు పట్టుకొని బతిమాలడానికి ?

అదిగో... అప్పట్నుంచీ మతిలేనివాడులా ఆ గదిలోనే కుమిలిపోతున్నాడు పిచ్చిసన్యాసి. ప్రేమో అని ఏడిసాడు. నిక్షేపంలా ఏభైవేలు కట్నం ఇస్తామన్న సంబంధాలు కాదని



తిరక్కొట్టేసేడు. ఇంకో మావగారయితే ఈపాటికో స్కూటరు కూడా కొనిచ్చేవాడు కదండీ! సరే. అన్నయ్యగారూ... ఇంకెన్నా ళ్ళూరుకుంటాం? కోర్టులో విడాకులిప్పించే స్తే — మళ్ళీ కో అంటే కోటి సంబంధాలు! అంత వెకిలితనం, మగాళ్ళ పిచ్చివున్న పిల్ల అంటే వెంటనే విడాకులిచ్చెయ్యకుండా ఆ రంకుదానితోనే కాపరం చెయ్యమని కోర్టు మాత్రం ఎలా చెప్తుందన్నయ్యగారూ?'' అని కథంతా చెప్పేసి అమ్మయ్య అనుకుంది వర్ధనమ్మ.

* * *

ఒకే తగువుని రెండు పక్షాలు విడివిడిగా చెప్పగా విన్నాడు శంకరం. ఇద్దరు చెప్పిన కథల్లోను చాలా అంశాలు సమానంగానే వున్నాయి. కొన్ని కీలకమైన తేడాలు కూడా వున్నాయి.

క్లైమేక్స్‌లో, పడగ్గదిలోకి దుర్గ వెళ్ళింది ఆ గదిలో మంచం మీద కనకయ్య పడుక్కొని వున్నాడు.

భానుమూర్తి చెప్పిన కథలోను, వర్ధనమ్మ వెర్షన్‌లోను కూడా ఈ అంశాలు సమానం గానే వున్నాయి. కాని,

దుర్గని కనకయ్య చెయ్యి పట్టుకొని లాగేడు. పైగా అత్తగారే దుర్బ్వున్న వంకపెట్టి కోడల్ని ఆ గదిలోకి పంపింది అంటాడు భానుమూర్తి. కోడలే మామగార్ని తట్టి లేపుతోంది అంటుంది వర్ధనమ్మ.

ఈ రెండింటిలోను ఒకటి నిజం. అయితే రెండోది అబద్ధం అవుతుంది. లేక రెండూ అబద్ధాలే కావచ్చు. అసలు నిజం ఇంకొకటవుతుందప్పుడు.

తగువుని వివరించేటప్పుడు రెండు పక్షా ల వాళ్ళు కూడా చాలావరకు నిజాలే చెప్పి, న్యాయం తమ పక్షానిదే అనిపించుకోడం కోసం కథలో ఎక్కడో ఒకచోట కీలకమైన మెలిక వేస్తారు. అర్ధసత్యాలో, అసత్యాలో చెప్తారు. సరిగ్గా అక్కడే కథ చిక్కులుపడిపో తుంది..

నాణేనికి రెండే ముఖాలుంటాయి. కాని తగువుకి మూడు ముఖాలుంటాయి. ఈ మూడు ముఖాల తగువు నాణెంలో రెండు ముఖాలు చూసేడు శివశంకరం.

రెండూ అర్ధసత్యాలే. మూడో ముఖం.. అసలు నిజం... అదేమిటో?

ఇది రామం, దుర్గల కాపురం సమస్య. అసలు నిజం వాళ్ళిద్దరికీ తెల్సు. కాని, శంకరానికి భానుమూర్తి కథ చెప్పినప్పుడు దుర్గ అక్కడే వుంది. వర్ధనమ్మ చెప్తుండగా రామం ఆ పక్కగదిలోనే వున్నాడు. కాని ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు.

* * *

శివశంకరం మనసు ఈ తగువులో ఇరుక్కుపోయింది. అసలు నిజం ఏమిటో తెలుసుకోవాలని, రామం, దుర్గల కాపురం సరిదిద్దాలని అతనికి ఆత్రుత, ఆసక్తి పెరిగా యి. ఆ అసలు నిజం తెలుసుకోవాలంటే, దుర్గ, రామం — వీళ్లే చెప్పాలి. వాళ్ళతో మాట్లాడాలి అనుకున్నాడు శంకరం.

ఓ రోజు భానుమూర్తి ఇంటికి వెళ్ళి

తలుపు కొట్టాడు శంకరం. దుర్గ వచ్చి తలుపు తీసింది. నాన్నగారు లేరు. పొలం వెళ్ళారు అని చెప్పింది. ఇంట్లో ఎవరూ లేరా అవడిగేడు. 'అమ్మ చెరువు కెళ్ళింది — ఎవరూ లేరు' అంది దుర్గ.

శివశంకరం లోపలి కదుగుపెట్టాడు. వీధి తలుపులు దగ్గరగా వేసి, సావిట్లో కుర్చీలో కూర్చుని ఆ కబురు, ఈ కబురు చెప్పి, అసలు విషయానికొచ్చాడు. వాళ్ళ కాపురంలో కలత ఎందుకొచ్చిందని అడిగేడు. దుర్గ మొహమాటపడింది. సంకోచించింది. శంకరం ధైర్యం చెప్పేడు. చివరికి దుర్గ పెదవి విప్పింది. "అత్తగారు కోడల్ని సాధించడం ఎక్కడైనా వున్నదే. దానికి నేను బాధపడడంలేదు. కాని ఆయన మనసులో ఏముందో తెలీదు. ఆయన ఒక్కరికీ నా మీద నమ్మకం వుంటే, ప్రేమ వుంటే ఎవరేమన్నా నాకు లెక్కలేదు. ఒకవేళ ఆయన మనసులో కూడా నా మీద అనుమానం వుంటే, ఇంక ఎంత మంది సానుభూతి చూపిస్తే ఏం లాభం? నేనేం తప్పుచెయ్యలేదు. నేనే పాపం ఎరగను. అసలు జరిగిందేమిటో ఆయనకు తెలుసు" అంది దుర్గ.

"ఆ జరిగిందేమిటో నువ్వు చెప్పమ్మా"

"క్షమించండి. ఆ నిజం ఆయన్నే అడగండి. ఆయన చెప్తేనే ఆ నిజానికి విలువ. మరి ఆయనెందుకు మౌనంగా వున్నారో నాకు తెలీదు. నేను నిజమే చెప్పినా ఆయన అది అబద్ధం అంటే నా నిజం ఏమవుతుంది?" అంది దుర్గ, ఆ నిజం ఏమిటో చెప్పలేదు.

ఇంతలో—

"భానుమూర్తిగారున్నారాండి!" వీధి తలుపులు కొంచెం తోసి తలలోపలికి పెట్టి అడిగేడొక వ్యక్తి. అతని పేరు విశ్వనాథం. వయసు పాతికదాటాయి.

"లేరు" అంది దుర్గ కూర్చునే

"మీ అమ్మగారు లేరా?"



గొడుగు

భార్యతో గర్వంగా అన్నాడు పరంధామయ్య — "ఏమేవ్ కాంతం! చూశావా? నేను మతిమరుపు వాణ్ణంటావుగా... చూడు ఈరోజు గొడుగు ఎలా మర్చిపోకుండా తెచ్చానో..."

"అయ్యో రామ! ఇవ్వాళ మీరసలు గొడుగే తీసుకెళ్ళలేదండీ!" నెత్తి బాదుకుంది భార్య.

—సుచంద్ర (ఖమ్మం)

''లేరు''

''ఇంట్లో ఇంకెవరూ లేరా?'' శివశంకర ంకేసిచూస్తూ దుర్గని అడిగేడు విశ్వనాథం.

''లేరు. ఏం కావాలి?'' అంది దుర్గ విసుగ్గా.

''ఏం వద్దులెండి'' అనేసి వెళ్ళిపోయాడు విశ్వనాథం.

శంకరం కూడా లేచాడు.

''సర్లేమ్మా. రామాన్ని కూడా అడిగి చూస్తాను'' అని వెళ్ళిపోయాడు.

తరవాత రామాన్ని అడగాలి, అతని మనసులో ఏముందో తెలుసుకోవాలి అనుకుంటూ, అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు శంకరం.

* * *

కార్తీకమాసం వెన్నెల రాత్రి. చిరుగాలి. సన్నసన్నగా చలి.

రామం, విశ్వనాథం మందు కొడుతున్నారు.

విశ్వనాథం, రామం హైస్కూల్లో క్లాస్ మేట్స్. రామం టీకాం పాసయ్యాడు. విశ్వనాథం టెన్త్ పాసవ్వలేదు. మార్చి, అక్టోబరు ఛాన్సులు నాలుగయిదుసార్లు టెన్త్ పరీక్షలు రాసి, ఫెయిల్ అయి ఇంక చదువు మానేసేడు. రెండేళ్ళు వూళ్ళో జులాయిగా తిరిగేడు. అతని తండ్రి సుబ్బారాయుడు కొడుకుని భరించలేక తమ్ముడు దగ్గరకి విశాఖపట్నం పంపేసేడు. అక్కడ విశ్వనాథం ఓడరేవులో ఏదో ఉద్యోగం సంపాదించాడు. తరవాత రెండు మూడు నెలలకోసారి ఇంటికొచ్చినప్పుడల్లా ఫారిన్ విస్కీ సీసా తెస్తూంటాడు. రామంతో కలిసి తాగుతాడు. బాటిల్ ఖరీదు రామం దగ్గర పట్టుకుపోతాడు.

అదొక పాడుపడిపోయిన ఇల్లు. తల్లిదండ్రుల చాటు పిల్లలు పేకాడుకోడానికి, ఇలా మందు కొట్టడానికి ఆ యింటి పెరడు రహస్యస్థావరంగా ఉపయోగపడుతోంది.

మూడు రౌండ్లు కొట్టేసేరు. నాలుగో రౌండ్‌లో రామం అన్నాడు.

''ఒరే నాథన్... ఫారిన్ సరుకు మహా బాగుందిరా. మళ్ళీ ఎన్నాళ్ళకి రుచి చూపిస్తావో!''

''ఏడిసావురా... వెధవ మాటలూ నువ్వూను! నువ్ వైజాగ్ వచ్చెయ్... అంతా ఫారిన్ సరుకే. ఒరే రామం... షిప్పుల్లో వస్తార దొరసాన్లు... వాళ్ళు మనం అంటే పడిచస్తార్రా! ఎన్నిసార్లు చెప్పినా రావు. నీకెందుకు... నేనున్నాను కదురా... ఒచ్చెయ్!''

''ఒచ్చెస్తానురా! ఒచ్చెయ్యాలి! కాని ఒరే గురూ... అదృష్టం వుండాలిరా! నేను ఒట్టి వెధవన్నా! నేనెక్కడికీ కదల్లేను. ఒక్కణ్నే కొడుకుని కదురా! ఒరే... నాథన్... నా గుండెలు మండిపోతున్నాయిరా! నా బతుకు బద్దలైపోయిందిరా!''

రామం ఏడుస్తూ గ్లాసు ఖాళీ చేసేసేడు.

''ఒరే ఫూల్... ఏమయిందిరా నీకు! ఒదిలీరా, ఆ బాధలన్నీ ఒదిలెయ్! అప్రాబ్... ఓ ఆడదాని కోసం... అదేరా... నీ వైఫ్... దాని పేరేంటి''

''దుర్గరా, కనకదుర్గ''

"ఆ... ఆ దురగ కోసం నీ బంగారు బతుకు బద్దలు కొట్టుకుంటావురా! ఒరే రామం, నువు సుద్ద వెదవ్విరా, గుడ్డి వెదవ్వి! అందుకే దురగో, నా దురగో అని తెగ ఏడుస్తున్నావు. కాని ఆ దురగ... అమ్మో, అది..."

"షటప్... ఒరే... దురగని ఏవన్నా అంటే వేనూరుకో(నా! నా దురగని పట్టు కొని అది, ఇది అంటే నేను..."

"ఆ...? ఏం చేస్తావురా? అంత కలేజా వుంటే ఏలుకోరా దాన్ని! మరి అంత ముద్దుల పెళ్ళాన్ని... ఎందుకొగ్గేసేవురా దాన్ని?"

"ఛీ... నోర్ముయ్! మళ్ళీ అదే కూత! ఒరే... నా దురగని, నీ ఫ్రెండు వైఫ్‌ని అది, ఇది అంటావురా?"

"అంటే ఏరా? ఒరే... ముందు నేనూ నమ్మలేదురా అందరూ చెప్తుంటే! కాని, మొన్న... విన్నకాన మొన్న... నా కళ్ళతో నేను చూసే(నా! అమ్మో... అది..."

"ఏం(టా... ఏంటి నువు చూసింది?

"నీ వైఫ్... అది... ఆ దురగ, ఆడెవడు... మీ ఇంటికెదురుగా వుంటాడు. ..."

"శివశంకరం"

"ఆ... ఆ శివశంకరంగాడితో కులికేస్తం దిరా నీ దురగ!"

నాథన్ చెంప ఛెళ్ళుమంది.

"ఒరే రాస్కెల్... నన్ను కొడితే నీ వైఫ్ పతివర్త అయిపోదురా! అయినా ఒరేయ్ నీ దురగ... దానికి ముసిలాళ్ళ పిచ్చేమి(టా బాబు! మొన్నటిదాకా నీ ఫాదరు, ఇప్పుడు.. ."

మళ్ళీ నాథన్ చెంప ఛెళ్ళుమంది.

"నరికేస్తా(నా... ఒరేయ్. నా దురగ నేమంటున్నావురా? ఏది... మళ్ళీ కుయ్!" నాథన్ రెచ్చిపోయాడు.

"నన్ను కొడతావురా... లంజా కొడకా? పెళ్ళాన్ని ఏలుకోడం చేతకాని కొజ్జా




## పిట్టకొంచెం...

నోబెల్ బహుమానం ఎందరో అందుకొన్నారు! ఆరు విభాగాలలో ప్రతి సంవత్సరం ఇచ్చే ఈ బహుమతి ఎంతో ప్రతిష్ఠాకరమైనది! మన దేశ జనాభా 84 కోట్లు దాటుతున్నా ముచ్చటగా ముగ్గురికి మాత్రమే ఈ బహుమతి లభించింది. టాగూర్, రామన్, థెరిసాలకుతోడు భారతీయులైన ప్రస్తుతం అమెరికా పౌరసత్వాన్ని కల్గిన ఖొరానా, చంద్రశేఖర్‌లు కూడా నోబెల్ పురస్కారం పొందారు! అయితే అతి చిన్నవయస్సులో ఈ బహుమతిని అందుకొన్న ఘనత బ్రిటిష్ భౌతిక శాస్త్రవేత్త అయిన సర్ విలియమ్ లారెన్స్ బ్రాగ్‌కు దక్కుతుంది. నోబెల్ బహుమతిని అందుకొన్న రోజున ఆయన వయస్సు ఇరవైఐదు సంవత్సరాలు మాత్రమే! ఇప్పట్లో ఈ రికార్డును మరెవరూ దాటలేకపోవచ్చు!

—జూపిటర్

నా..."

రామం, నాథన్ మీద పడ్డాడు. నాథన్‌ని వెనక్కి తోసేసేడు.

"హోర్నీ... అది... ముసిలాణ్ణి... మా మగార్నే పట్టేసిందంటే"

ఖాళీ చేసిన విస్కీ సీసాతో నాథన్ నెత్తిమీద కొట్టాడు రామం. నాథన్ తలపక్కకి వంచాడు. సీసా నేలమీద పడి బద్దలయింది. పగిలిన సీసా పెంకు నాథన్ మెడ దగ్గర గీసుకుపోయింది. రక్తం కారుతున్నా నాథన్‌కేమీ తెలీడంలేదు. రొప్పుతున్నాడు. తిడుతున్నాడు. తూలుతున్నాడు. కేకలేస్తున్నాడు.

వీళ్ళ కేకలకి, తిట్లకి అక్కడక్కడ అరుగుల మీద కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళు, పేకాడుతున్న వాళ్ళు గబగబ వచ్చేసేరు. వాళ్ళిద్దర్నీ విడదీసి పెరట్లోంచి వీధి అరుగుమీదకి తీసుకొచ్చారు. ఈ కబురు తెలిసి సుబ్బారాయుడు, కనకయ్య, భానుమూర్తి ఒక్కరొక్కరే వచ్చారు. అంతలోనే శివశంకరం వచ్చాడు.

రామం, నాథన్‌ల పరిస్థితి అందరికీ తెలుస్తూనే వుంది. నాథన్‌కి మెడ దగ్గర రక్తం కారుతోంది.

వీళ్ల పోట్లాట, కేకలు విని ముందుగా అక్కడికి వచ్చినవాళ్ళు, వాళ్ళ ద్వారా ఆ తరవాత వచ్చిన వాళ్ళు ఆ పోట్లాటకి కారణాలు, తప్పొప్పులు చర్చిస్తూండడంతో — ఆఖర్న వచ్చిన శివశంకరంతో సహా అందరికీ వాళ్ళ పోట్లాట వివరం అర్థంఅయింది.

నలుగురు కుర్రాళ్ళ సాయంతో నాథన్‌ని డాక్టర్ దగ్గరకి తీసికెళ్ళాడు వాళ్ళ నాన్న సుబ్బారాయుడు.

ఇంక జనం జట్లు జట్లుగా అక్కణ్నుంచి కదిలారు.

రామం అరుగుమీద గోడకి జారపడి కూర్చున్నాడు.

"ఒరే రామం... లే... ఇంటికెళ్దాం పద!" అన్నాడు కనకయ్య.

రామం కదల్లేదు. ఎన్నిసార్లు బతిమాలినా రానుగాక రానన్నాడు.

"పోనీ మా ఇంటికి వెళ్దాంలే రామం! మా ఇంట్లో పడుక్కుందువుగాని" అన్నాడు శంకరం.

అప్పుడు లేచాడు రామం. శివశంకరం రామాన్ని పట్టుకొని జాగ్రత్తగా నడిపించుకుంటూ ఇంటికి తీసికెళ్ళాడు. వాళ్ళ వెనకే కనకయ్య, ఆ వెనక భానుమూర్తి వెళ్ళారు. రామాన్ని ఇంట్లోకి తీసికెళ్ళి మడత మంచం వేసి పడుకోపెట్టేడు.

"ఇక్కడెందుకురా... మనింటికొచ్చెయ్" మళ్ళీ బతిమాలేడు కనకయ్య.

"రాను" సర్రమని లేచి కూర్చుంటూ గదమాయించి అన్నాడు రామం, అని "శంకరంగారు... దుర్గని తీసుకొని రమ్మని చెప్పండి!" చెయ్యి భానుమూర్తివైపు చాపి ఆజ్ఞాపిస్తున్నట్లన్నాడు రామం.

అప్పటికి అర్ధరాత్రి అవుతోంది.

శంకరం, భానుమూర్తి మొహం మొహాలు చూసుకున్నారు. కనకయ్య ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు.

"ఏం... దుర్గని తీసుకురారా?" మళ్ళీ ఉరిమేడు రామం.

అతని కళ్ళు చింతనిప్పుల్లాగున్నాయి.

"రేపు తీసుకొస్తాములే రామం! నువ్వు నిద్రపో" అన్నాడు భానుమూర్తి.

"లేదు... ఇప్పుడే తీసుకురావాలి" అరిచాడు రామం.

ఇప్పుడు రామం మానసిక పరిస్థితి కొంచెం కొంచెం అర్థం అవుతోంది. కనకయ్యకి చాలా భయంగా వుంది. భానుమూర్తికి అయోమయంగా వుంది. శివశంకరానికి ఆసక్తిగా వుంది.

"వెళ్ళి అమ్మాయిని తీసుకురండి భాను మూర్తిగారూ" అన్నాడు శంకరం కనకయ్యని పట్టించుకోకుండా.

భానుమూర్తి మాత్రం తటపటాయిస్తున్నాడు కనకయ్య ఏమంటాడో అని, "ఏం.. తీసుకొస్తారాలేదా చెప్పండి! లేకపోతే నేనే, ఇప్పుడే వెళ్ళి మీ ఇంటి ఎదురుగా రోడ్డుమీద నిలబడి దుర్గా, దుర్గా అని పిలుస్తాను. ఎందుకు రాదో చూస్తాను"

భానుమూర్తికి సంజ్ఞ చేసేడు శంకరం. భానుమూర్తి వెళ్ళాడు. కనకయ్యకి కంగారెత్తిపోయింది. గబగబ వాళ్ళింటికెళ్ళాడు. పెళ్ళాన్ని తీసుకొచ్చాడు. వర్ధనమ్మ [illegible] రాగాలు మొదలెట్టింది. రామం వాళ్ళ[illegible] చూడలేదు. వాళ్ల రాగాలు వినలేదు.

భానుమూర్తి దుర్గని తీసు[illegible]

దుర్గని గుమ్మంలో చూస్తూనే [illegible] అంటూ మంచ[illegible] ఆగలో [illegible] దు. దుర్గా... దుర్గా... [illegible] గట్టిగా [illegible] లోపలికి తీసుకొచ్చాడు.

వర్ధనమ్మ గుండె మండిపోయింది.

"ఒరే నాన్నా... ఏమిట్రా ఈ పన్లు? ఏమయిందిరా నీకు?" అంది గాబరాగా.

తల్లికేసి చూడలేదు రామం:

"దుర్గా..." దుర్గ భుజం కుదుపుతూ అన్నాడు.

"దుర్గా ఆపలేం జరిగిందో తెల్సా. వాడు... ఆ రాస్కెల్ నాథన్‌గాడు, వేసు



తాగుతున్నాం. బాగా తాగేసేం. ఆ వెధవ ఏం కూసేడో తెల్సా... మొన్నటిదాకా మీ నాన్నతో కులికింది, ఇప్పుడు ఆ శివశంకరం తో సాగిస్తోంది — దానికోసం ఎందుకురా ఏడుస్తావు అన్నాడు''

దుర్గ ఏడుస్తోంది. శంకరం మనసు మీద ముల్లుపెట్టి పొడిచినట్లయింది.

''క్షమించండి శంకరంగారూ... ఆ లోఫర్‌గాడి మాటలకి బాధపడకండి. దుర్గా... ఏడవకు దుర్గా. ఇంక నిన్ను ఏడవనీను. ఆ వెధవ అలా అంటూండగానే ఏం చేసేనో తెల్సా? తాగేసిన ఖాళీ సీసాతో వాడి నెత్తిమీద కొట్టేసేను'' అని ఓసారి తల్లికేసి చూసి,

''దుర్గా... ఇన్నాళ్లూ నాలో రగులుకుంటున్న కసి ఆ దెబ్బతో ఒక్కసారి ఎగతన్నుకువచ్చింది. నా దుర్గని గురించి వూరంతా ఇలాగే అన్నారు శంకరంగారూ! అలా అన్న ప్రతి వెధవ తలకాయని చితక్కొట్టెయ్యాలి అని పళ్ళు నూరుకుంటూ వుండేవాడ్ని ఇన్నాళ్ళూ! ఆ పని ఇన్నాళ్ళకి చెయ్యగలిగేను. ఇటుపైన దుర్గని ఎవరైనా ఏమయినా అంటే శంకరంగారూ... నేను హంతకుణ్నయిపోతాను''

కనకయ్య, వర్ధనమ్మ అవాక్కయిపోయారు. వాళ్ళ ఇబ్బంది గ్రహించాడు శంకరం. ''ఇంక మీరు వెళ్ళండి కనకయ్యగారూ... రేపు మాట్లాడుకుందాం'' అన్నాడు.

వర్ధనమ్మ విసవిస వెళ్ళిపోయింది. ఆమె వెనకే కనకయ్య వెళ్ళాడు. భానుమూర్తిని పక్కకి తీసికెళ్ళి ఏదో చెప్పేడు శంకరం. అతనూ వెళ్ళిపోయాడు.

''రామం... ఇక పడుకోండి. రేపు మాట్లాడుకుందాం'' అంటూ లేవబోయాడు శంకరం.

''ఆగండి శంకరంగారూ. ఇప్పుడు నాకు నిద్ర ఎలా వస్తుందండీ! ఈ రోజు నేనొక గొప్ప పనిచేసేను. నాకు చాలా సంతోషంగా వుందండీ. నేను మీకు చాలా చెప్పాలి సార్! శంకరంగారూ... నేను దుర్గని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను సార్... నిరాహారదీక్షలు చేసి, నిద్రమాత్రలు మింగి మా అమ్మని భయపెట్టి ఒప్పించి పెళ్ళి చేసుకున్నాను. అంత ప్రేమతో, సాహసంతో దుర్గని పెళ్ళి చేసుకున్నానాండి — మరి ఆ దుర్గమీద మా అమ్మే, నా ఎదురుగానే అభాండాలు వేసినప్పుడు పిరికివెధవనైపోయాను. నోరు మెదపలేకపోయాను. అసలు... ఏం జరిగిందో తెల్సాండి! మా అమ్మ మీకు అబద్ధాలు చెప్పిందండీ! ఆ రోజు... దుర్గని పొద్దుట్నుంచీ గదిలోకి రమ్మని సంజ్ఞలు చేస్తూ సతాయిస్తూనే వున్నానండీ. పల్లెటూరు కద... పగలు కొత్త దంపతులు మాట్లాడుకున్నారంటేనే విడ్డూరం. ఆఖరుకి — వస్తాను — తొందర పెట్టద్దని దుర్గ సంజ్ఞచేసి చెప్పింది. మా నాన్న పొలం వెళ్ళిపోయాడు పొద్దున్నే. ఇంక మా అమ్మ చెరువుకి ఎప్పుడు వెళ్తుందా అని నేను వీధి అరుగుమీద కూర్చుని జపం చేస్తున్నాను. మా అమ్మ కూడా చెరువుకి వెళ్ళింది. కాని ఇంతలోనే మా నాన్న పొలం నుంచి వచ్చాడు ఎండనపడి. మడతమంచం గుడ్డ ఆ రోజే తీసి ఎండలో పడేసేం నల్లులు పట్టాయని. అలసటతో వచ్చాడేమో... ఎప్పుడూ పడు

క్కోనివాడు ఆ రోజు గదిలోకెళ్ళి మంచం మీద పడుక్కున్నాడు.

ఇంక నాకేం తోచలేదు. అలాగే అరుగు మీద కూర్చుండిపోయాను.

దుర్గకిదేం తెలియదు. మా అమ్మ చెరువుకి వెళ్ళగానే గదిలోకి వెళ్ళింది. మంచం దగ్గరగా వెళ్ళి, మంచం మీద మా నాన్నని చూసి కంగారుపడి నాలిక్కొరుచుకొని గదిలోంచి బయటకొస్తూండగా ఆ అలికిడికి మా నాన్న తలెత్తిచూడడం, సరిగ్గా అదే సమయానికి మా అమ్మ వేరే బింది కోసం వెనక్కి వచ్చి ఇంట్లోకి వస్తూండగానే ఆ దృశ్యం చూడడం జరిగిపోయాయి. అంతే! మా అమ్మ దుర్గని తిడుతూ పెద్దపెద్ద కేకలేసేసింది. రంకు దానివంది, కొంపలు కూల్చే కొరివివంది. పెద్ద రభస చేసేసింది — అందరికీ వినబడేలా. సాయంత్రానికి ఈ గొడవ ఊరందరికీ చర్చనీయాంశం అయిపోయింది.

"సార్... ఇంక నేనేం చెయ్యాలి? మా అమ్మే దుర్గ మీద నింద మోపింది. ఊరంతా అది నిజమే అని నమ్ముతారు. ఇప్పుడు నేను మా అమ్మని ఎదిరించి దుర్గని తీసుకొని ఎక్కడికయినా వెళ్ళిపోదామా అనుకున్నాను కాని... తండ్రితో కులికిన దానితోనే కాపురం చేస్తున్నానంటారు. మాట్లాడక వూరుకున్నాను సార్ ఏం చెయ్యాలో తెలీక! ఏ పాపం ఎరగని నా దుర్గ ఎంత క్షోభ పడుతోందో కదా అని కుమిలిపోయాను సార్!

మా అమ్మ దుర్గ మీద నిందమోపింది. మా మామగారు అతితెలివికిపోయారు. మా నాన్నే దుర్గ చెయ్యిపట్టుకొని లాగేడని ఈ కథకి ఒక మెలిక వేసేరు. ఎవరికివారు తన ఆరోపణే ఊరంతా నమ్ముతారు అనుకున్నారు. కనబడ్డ వాళ్ళందరికీ స్వయంగా చెప్పేరు. మరి నాలుగు కలిపించి చెప్పేరు కథ బలంగా వుంటుందని. వాళ్ళ వాదనలు నిలబడాలనుకున్నారు. వాళ్ళ పిల్లల కాపురం నిలబడాలనే ఆశయం చచ్చిపోయింది. కాని,



## ఫీలింగ్

"ఏమోయ్ గుర్నాథం. మొదటిసారిగా ఏరోప్లేన్‌లో పయాణం చేశావటగా ఎలా ఫీలయ్యావ్?"

"తొలిసారి కదా... దేహం ప్లేన్‌లో, ప్రాణం గాల్లో ఉన్నట్టనిపించిందోయ్..." బిడియంగా చెప్పాడు గుర్నాథం.

—సత్యపాల శ్రీదేవి (గుంతకల్)

ఇద్దరు చెప్పిన కథలూ విని, 'మామగార్నూ, కోడలు చాటుగా కథ నడుపుకుంటున్నారు, అది కాస్త బయటపడిపోయింది, ఇంక తన మొగుడి తప్పు కప్పెట్టుకుందుకు అత్తగారు కోడలు మీద నిందమోపి బయటికి గెంటేసింది, తండ్రేమో — వియ్యంకుడే దౌర్జన్యం చేసేడు తన కూతురు పతివ్రతే అంటున్నాడు — ఇదీ అసలు లోగుట్టు' అని నలుగురూ అనుకోడం నాకు తెలుసు శంకరంగారూ!

ఇంక మా అమ్మని, ఊళ్ళో జనాన్ని తిట్టుకుంటూ, నా దుర్గ కోసం ఏడుస్తూ కూర్చోడం తప్ప నేనేం చెయ్యాలో నాకు తెలీలేదు. కాని సార్... ఈ రోజు, ఇన్నాళ్ళకి విస్కీ తాగిన మైకంలో — ఆ నాథన్ ఆ మాట అనగానే నాలో గొప్ప తెగింపు వచ్చేసింది. రెచ్చిపోయాను'' అని,

''దుర్గా... నన్ను క్షమించు దుర్గా... ఇలా తాగేనని ఏమీ అనుకోకు. నా అసమర్థతకి నా మీద నేను కసి పెంచుకొని ఇన్నాళ్ళూ తాగేను... ఇంకెప్పుడూ తాగను దుర్గా'' అన్నాడు ఆమె కన్నీళ్ళు తుడుస్తూ.

''శంకరంగారు... ప్రస్తుతానికి రెండు మూడు రోజులు మమ్మల్ని మీ ఇంట్లో ఉండనివ్వండి. తరవాత ఏదో దారి చూసుకుంటాం'' అన్నాడు రామం.

''ఓ.. దానికేం భాగ్యం! ఇంత ఇంట్లో వుండేది నేనొక్కణ్నే కదా! అటువైపు రెండు గదులూ మీరు వాడుకోండి. నాకూ సాయంగా వుంటారు'' అని,

''సరే... చాలా రాత్రి అయింది. ఆ వసారాలో పట్టిమంచం వుంది. మీరు అక్కడ పడుక్కోండి. నేనీ మడతమంచం సావిట్లో వేసుకుంటాను'' అన్నాడు.

లైట్లు ఆరాయి.

* * *

సాయంత్రంవేళ... శివశంకరం పొలంవైపు బయల్దేరేడు. పిల్లకాలవ గట్టున నడుస్తున్నాడు. ఈ పల్లె అనుభవాలు, నాథన్ తనపై వేసిన నింద, అన్నీ ఆలోచిస్తున్నాడు.

కుడిచేతివైపు కొబ్బరితోట. ఎడంచేతిపక్కన పిల్లకాలవ. కొబ్బరి చెట్ల తలల నీడలు కాలవనీటిమీద పడుతున్నాయి. నీడలేని చోట్ల లేత ఎండలో నీళ్ళు మిలమిల మెరుస్తున్నాయి.

ఆ మిలమిలల్లో పల్లె సీమల గురించి కవులు వర్ణించే స్వచ్ఛత, భోళాతనం కనిపిస్తున్నాయి.

కాస్త పరకాయించి చూస్తే, కొబ్బరిచెట్ల నీడలు పడినచోట్ల కాలవలో కొట్టుకొస్తున్న చెత్త, చెదారం తెట్టు కట్టి కనిపిస్తున్నాయి. అమాయకత్వంలా కనుపించే గ్రామ సీమల్లో దాగివున్న మానసిక కాలుష్యంలాగుంది ఆ తెట్టు.

నగరాలలోని యాంత్రిక జీవనానికి, వాతారణ కాలుష్యానికి విసుగు, విరక్తి కలిగి పల్లెసీమకి పరుగెత్తుకొచ్చాడు శంకరం.

ఈ పల్లెల్లోని నిస్తేజ జీవితానికి, మానసిక కాలుష్యానికీ భయం, బెదురు పుట్టి ఇక్కణ్నుంచి పారిపోవాలనిపిస్తోందిప్పుడు.

కాని ఎక్కడి కెళ్ళాలి? ప్రశాంత జీవితం ఎక్కడ?

మళ్ళీ కొండగుహల్లోకి చెట్టు తొర్రల్లోకి పోవాలా?